క్లుప్తంగా

జెడ్పీ నిధులు విడుదల

సత్యవేడు: మండల పరిధిలోని సత్యవేడు శివాలయం రోడ్డు సిమెంటు రోడ్డుగా ఆధునీకరణ, పలు గ్రామాల్లో నీటి వసతికి బోర్లు ఏర్పాటుకు రూ.30 లక్షలు జెడ్పీ నిధులు మంజూరయ్యాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి తెలిపారు. స్థానిక శివాలయం సిమెంటు రోడ్డు ఏర్పాటుకు రూ.10 లక్షలు, దాసుకుప్పంలో బోరు ఏర్పాటుకు రూ.3లక్షలు, సత్యవేడు గంగమిట్టవద్ద బోరుకు రూ.3లక్షలు, ఆరూరులో బోరుకు రూ.3లక్షలు, మల్లవారిపాళెం వెస్టు రూ.1.5లక్షలు, జడేరిలో బోరు ఏర్పాటుకు జెడ్పీ నిధులు రూ.5 లక్షలు, ఎంపీపీ నిధులు రూ.5 లక్షలతో తాగునీటి వసతి, సిమెంటు రోడ్డు వసతి కల్పిస్తామని జెడ్పీటీసీ తెలిపారు.

108 వాహనంలో ప్రసవం


108లో కాన్పు చేసిన వైద్య సిబ్బంది

నాగలాపురం: మండల కేంద్రంలో వెస్ట్ దళితవాడకు చెందిన సునీత(24)కు మంగళవారం పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే ఆమెను కుటుంబసభ్యులు నాగలాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యాధికారి ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి విషమం కావడంతో 108 వాహనంలో నగరి ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. 108లో నింద్ర మండలం చవరంబాక్కం గ్రామం వద్ద వెళ్తుండగా సునీత పురిటి నొప్పులకు విపరీతంగా ఇబ్బందులు పడడం చూడలేక 108 వైద్యసిబ్బంది వాహనాన్ని పక్కన ఆపి కాన్పు చేశారు. సునీత పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. సురక్షితంగా నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈఎన్‌టీ నిరోషా, పైలట్ సతీష్ పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన


ఎంపికైన వారితో అధ్యాపకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్పీఎస్ పురుషుల డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన ఉద్యోగమేళాకు విశేష స్పందన లభించింది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జేకేసీ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరిగింది. ఇందులో 7 బహుళ జాతీయ కంపెనీల హెచ్ఆర్‌లు హాజరయ్యారు. 114 మంది యువత ఈ ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 69 మంది ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శ్రీలత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, జేకేసీ కోఆర్డినేటర్ గిరిజ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం


మురుగును తొలగిస్తున్న జేసీబీ

ఏర్పేడు: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య అన్నారు. మంగళవారం వెంకటగిరి రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ పొలాలకు నీటిని అందించే పంట కాల్వలో జేసీబీతో మురుగు తొలగింపు కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ చెత్తచెదారాలను రోడ్లపై వేయరాదని సూచించారు. అపరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఇళ్ల వద్ద నీటితొట్టిల్లో ఎక్కువ రోజులు నీటిని ఉంచరాదన్నారు. గ్రామస్తులు ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు.

'గౌరిపెద్ది' కృషిని మరువలేం


సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : అన్నమయ్య సంకీర్తనలను పరిష్కరించడంలో గౌరిపెద్ది రామసుబ్బశర్మ కృషి మరువలేనిదని స్విమ్స్ వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో గౌరిపెద్ది రామసుబ్బశర్మ 102వ జయంతి సందర్భంగా సాహితీ సదస్సు నిర్వహించారు. ఆర్వీ కుమార్ మాట్లాడుతూ అద్భుతమైన సాహితీ సృజన చేసిన ప్రముఖుల్లో గౌరిపెద్ది ఒకరని కొనియాడారు. అన్నమాచార్యుల సంకీర్తనలు 27 సంపుటాలను పరిష్కరించారని వెల్లడించారు. అనంతరం ఓరియెంటల్ కళాశాలలోని గౌరిపెద్ది రామసుబ్బ శర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ సర్వోత్తమరావు అవధాన సరస్వతి డాక్టర్ గండ్లూరి దత్తాత్రేయ శర్మ, అభినయ కూచిపూడి కళాక్షేత్రం వ్యవస్థాపకులు పవని శ్రీలత, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ, గౌరిపెద్ది శంకర భగవాన్, ఉప సంచాలకుడు డాక్టర్ నరసింహాచార్య, ప్రోగ్రామ్ అసిస్టెంట్ కోకిల, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయాలు


పదో మైలు వద్దనున్న మలుపు, నెరిణికండ్రిగ గ్రామం వద్ద మలుపు, కారణి వద్ద మలుపు

- మలుపుల వద్ద వాహనదారుల భయాందోళన
- ప్రమాద నిరోధకాలను ఏర్పాటు చేయని అధికారులు


విజయగోపాలపురం మలుపు వద్ద ఆటోను ఢీకొన్న లారీ (ఫైల్) కాటూరు గ్రామం కాళంగి నది వంతెన మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో మృతిచెందిన రమేష్ (ఫైల్)

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తడ-శ్రీకాళహస్తి రోడ్డులోని మలుపులు యమలోకానికి ద్వారాలుగా ఉన్నాయి. ఏ మాత్రం ఏమరుపాటుగా వెళ్లినా అంతే సంగతులు. తడ-శ్రీకాళహస్తి రోడ్డు మండలంలో 45 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డు వెంబడి 16 మలుపులు ఉండడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. మలుపు వద్ద వాహనదారులు పలువురు ప్రాణాలను కొల్పోతుండగా, చాలామంది గాయాల పాలవుతున్నారు. శ్రీకాళహస్తి నుంచి తడ మార్గంలో మండలంలోని చల్లమాంబపురం, పార్లపల్లి, పల్లమాల, పల్లమాల కండ్రిగ, కాళంగి వంతెనకు రెండు వైపులు, అరిగికండ్రిగ, విజయగోపాలపురం, పదో మైలు, కాంపాళెం సెంటర్, తానిగిలు, నెరిణికండ్రిగ, కారణి, నెలవాయి, తలారివెట్టు, ఎన్టీఆర్ నగర్ గ్రామాల వద్ద మలుపులు ఉన్నాయి. రెండు లేన్ల రోడ్డు కావడంతో వాహనాలు విపరీతమైన వేగంగా వెళ్తుంటాయి. రోడ్డుపై రోజుకు 7 వేల వాహనాలకు పైగా వెళ్తాయి. చెన్నై, శ్రీసిటీ, శ్రీకాళహస్తికి కంటైనర్ లారీలు ఎక్కువగా తిరుగుతాయి. 45 కిలోమీటర్లు దూరం ఉన్న రోడ్డుకు ఇరువైపుల 26 గ్రామాలున్నాయి. మలుపులు ఎస్, ఎల్ ఆకారంలో ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కంటికి కనపడవు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగంగా వచ్చే వాహనాలు ఒకదానికొకటి ఢీకొంటున్నాయి. దీంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రతివారం ప్రమాదం బారిన పడుతుంటారు.

మృత్యువాత

మండలంలోని విజయగోపాలపురం గ్రామం వద్దనున్న మలుపు వద్ద 2018 ఫిబ్రవరి 13న పదో మైలు గ్రామం వద్ద జరిగిన ప్రమాదంలో పలువురు మృత్యువాత పడ్డారు. ఆటోను లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. మయూరి సూదలగుంట షుగర్ కర్మాగారంలో పనిచేస్తున్న రామారావు(52), ఆయన భార్య కన్యకుమారి(45), పురుషోత్తం, ఆయన కుమారుడు అనంత్ రామ్(17), కుమార్తె బిందుమాధవితోపాటు ఆటో డ్రైవర్ వెంకట్రామయ్య మృతిచెందారు. పురుషోత్తం, ఆయన భార్య మహాలక్ష్మి, మహాలక్ష్మి మేనల్లుడు శశాంక్, ప్రయాణికుడు నారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరే కాకుండా ఇంకా పదుల సంఖ్యలో మృత్యువాత పడగా, మలుపు వద్ద ప్రమాదాలకు గురై తీవ్రగాయాల పాలయ్యారు. ఈ సంవత్సరం ఏడు నెలల్లో ముగ్గురు ప్రాణాలను కొల్పోయారు. ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. రాత్రి వేళ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు వెంబడి ప్రమాదకర మలుపులున్న చోట వేగ నిరోధకాలు, బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. అధికారులు ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేసి ఊరుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని కేటీరోడ్డు మలుపుల వద్ద వేగనిరోధకాలను ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు. మలుపుల వద్ద వేగ నిరోధకాలు ఏర్పాటు చేస్తామని ఆర్అండ్‌బీ అధికారులు ఈసందర్భంగా తెలిపారు.

ప్రమాదాలను నియంత్రించాలి

"మండలంలోని కేటీరోడ్డు వెంబడి ఉన్న మలుపు వద్ద వేగ నిరోధకాలను ఏర్పాటు చేసి ప్రమాదాలను నియంత్రించాలి. పదో మైలు, తానిగిలు, నెరిణికండ్రి, కాళంగి వంతెన వద్ద మలుపు ఎస్ ఆకారంలో ఉండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రాణాలను పొగొట్టుకొంటున్నారు.
– గురవయ్య, వాహనదారుడు

అధికారులు పట్టించుకోవడం లేదు

మండలంలోని కేటీ రోడ్డుకు ఉన్న మలుపులకు వేగనిరోధకాలను ఏర్పాటు చేయాలని ఫిర్యాదు చేసినా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. రద్దీగా ఉండే రోడ్డు కావడంతో మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి.
– నవీన్, వాహనదారుడు, నెరిణికండ్రిగ

వరద పాపం చంద్రబాబుదే!

- బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం
- చంద్రబాబుకు ప్రజల ఉసురు తగులుతుంది
- నాడు వద్దన్న రేషన్ బండ్లు నేడు కీలకం
- సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్


నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: చంద్రబాబు స్వార్థం, నిర్లక్ష్యం ముందస్తు చర్యల్లో ప్రణాళికబద్ధమైన కార్యాచరణ లోపం వల్లే విజయవాడలో సంభవించిన వరదలతో నష్టపోయిన బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు హెచ్చరికలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఈ వరద విపత్తు నష్టానికి ముమ్మాటికీ చంద్రబాబుదే బాధ్యత అని తీవ్రంగా మండిపడ్డారు. 50 మందికి పైగా మరణించి లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని ఆయన ధ్వజమెత్తారు. ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి పునరావాసం, కనీస వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. భారీ వర్షాలు, వరదలు వస్తాయని ముందే తెలిసినా ప్రజలను అప్రమత్తం చేయలేదన్నారు. కేవలం చంద్రబాబునాయుడు ఇల్లు మునిగిపోకుండా, ఓ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదలడంతోనే ఇంత ఘోరమైన పరిస్థితి నెలకొందన్నారు. వరదలు తగ్గుముఖం పట్టినప్పటికీ సహాయ చర్యల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. లక్షలాది మంది తాగేందుకు నీరు కూడా లేక ఆకలితో అలమటించి పోతున్నారన్నారు. 9 రోజుల పాటు లక్షల మంది ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని మండిపడ్డారు. వరద బాధితుల కోసం చంద్రబాబు ఏదో చేస్తున్నట్లు ఎల్లో మీడియాలో విపరీతంగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. అధికారులను వెంట వేసుకుని తిరగడం తప్ప వారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించి పర్యవేక్షించే ప్రయత్నం చేయడంలో సీఎం పూర్తిగా విఫలమైనట్లు పేర్కొన్నారు. ముమ్మాటికీ వరద పాపం చంద్రబాబుదేనని మండిపడ్డారు. నాడు కూటమి ప్రభుత్వం వ్యతిరేకించిన రేషన్ బండ్లు నేడు వరద సహాయక చర్యల్లో కీలకంగా మారాయని, ఇది జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తు ఆలోచనలకు నిదర్శనమన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించడంలో కీలకంగా మారిన వలంటీర్ వ్యవస్థను దూరంగా పెట్టడమే నేడు వరద సహాయక చర్యల్లో కూటమి ప్రభుత్వం విఫలమవడానికి ప్రధాన కారణంగా ఆయన పేర్కొన్నారు. వలంటీర్ సేవలు నేడు కొనసాగి ఉంటే ఏ మూల ఏ విపత్కర పరిస్థితి సంభవించిందో క్షణాల్లో ప్రభుత్వానికి చేరవేసే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరచి బాధిత ప్రజలకు అండగా నిలవాలని ఆయన సూచించారు.

వికసిత్ భారత్‌కు ఎంపిక అభినందనీయం

–కలెక్టర్ వెంకటేశ్వర్


కలెక్టర్ నుంచి సత్కారం అందుకుంటున్న రుూన్సీ, యువకిరణ్

వరదయ్యపాళెం: జాతీయస్థాయిలో గుజరాత్ రాష్ట్రంలోని వాద్‌నగర్‌లో నిర్వహించిన ప్రేరణ వికసిత్ భారత్ కార్యక్రమానికి సంతవేలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఝూన్సీ, ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థి యువకిరణ్ ఎంపిక కావడం అభినందనీయమని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. అలాగే ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీ ఎర్రకోటలో జరిగిన వేడుకలకు వీరు తిరుపతి జిల్లా నుంచి హాజరుకావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీరిని మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతులమీదుగా శాలువాతో సత్కరించారు. అలాగే వీరికి గైడ్‌గా వ్యవహరించిన తెలుగు ఉపాధ్యాయురాలు ఎస్.వి.లతను కూడా సత్కరించి మెమెంటోలను అందజేశారు.

విశాఖ ఉక్కు ప్రైవేటుపరం చేయొద్దు


నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

శ్రీకాళహస్తి: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేయొద్దని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడేళ్లుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా కేంద్రానికి కనీసం చీమకుటినట్లు లేదని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే విశాఖ ఉక్కును దక్కించుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను కార్పొరేట్లకు కట్టబెట్టడం, నష్టాల్లో, అప్పుల్లో ఉన్న కార్పొరేట్ సంస్థలను దత్తత తీసుకోవడం మోదీ ప్రభుత్వానికే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఇకనైనా మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. పెనగడం గురవయ్య, మురళి, వైఎస్ మణి, గంధం మణి, రాపూరు సుబ్రహ్మణ్యం, వెంకటేష్, వేణు, రాజా, అన్వర్‌బాషా పాల్గొన్నారు.


వరదయ్యపాళెంలో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నేతలు

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేయొద్దని ఏఐటీయూసీ, ప్రజాసంఘాలు మంగళవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్ర రాష్ట్ర హక్కు అని, అలాంటి పరిశ్రమను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే ప్రశ్నించాల్సిన కూటమి ప్రభుత్వంలోని సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం నాయకులు విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ కానీయ్యమని హామీ ఇచ్చి నేడు ఆ అంశంపై స్పందించకపోవడం దారుణమన్నారు. ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చిన్నిరాజ్, సీపీఐ మండల కార్యదర్శి తరుణ్, నేతలు సిద్ధలయ్య, చంద్రశేఖర్, బాలగురునాథం, కృష్ణమూర్తి, నాగార్జున, చంద్ర పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఇచ్చిన నగదు చెల్లించాలని అడిగినందుకు ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర మంగళవారం రాత్రి తెలిపారు. మండలంలోని పాపానాయుడుపేటకు చెందిన నాగ మురగప్ప మొదలి చిటీలు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో మర్రిమంద గ్రామానికి చెందిన పరశురాంకు రూ.5 లక్షలు నగదును వడ్డీకి ఇచ్చాడు. ఈనెల 1న ఇచ్చిన నగదును చెల్లించాలని పరశురాంను నాగమురగప్ప మొదలి అడిగాడు. అదేరోజు మధ్యాహ్నం 1గంటకు తిరవళ్లూరుకు చెందిన త్యాగరాజు, పరశురాం కలిసి నాగమురగప్ప మొదలి ఇంటికి వెళ్లి దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

జీఓ నంబర్ 85ను ఉపసంహరించుకోవాలి


చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది

వరదయ్యపాళెం: పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో సీట్ల కేటాయింపు శాతాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 85ను వెంటనే ఉపసంహరించుకోవాలని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఓను వ్యతిరేకిస్తూ మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ జీఓ 85 ద్వారా తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండాపోయిందని, పీజీలో చదివే అవకాశాలు తగ్గించడం వల్ల తీవ్రంగా నష్టపోతామని వారు ఆవేదన చెందారు. ఈనెల 11, 12 తేదీల్లో విధుల్లో కొనసాగుతూనే నిరసన తెలియజేస్తామని, 13న అత్యవసర కేసులకు మాత్రమే హాజరవుతామని వారు తెలియజేశారు. వైద్యాధికారులు అనిత, లావణ్య, సిబ్బందితో కలసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సీడీపీఓ

శ్రీకాళహస్తి రూరల్: సమతుల ఆహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిదుర్గ అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని ముద్దమూడి అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పౌష్టికాహారం ప్రాముఖ్యతపై కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రాజెక్టు పరిధిలో ప్రతి గ్రామంలో రక్తహీనత పరీక్షలు, గ్రోత్ మానిటరింగ్, కాంప్లిమెంటరీ ఫీడింగ్, పోషన్ బీ, పఢాయి బీ, మాస్ సెన్సిటైజేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలకు పూర్వప్రాథమిక విద్య ప్రధాన ఉద్దేశం, పిల్లల సంపూర్ణ అభివృద్ధి గురించి ఆమె తెలియజేశారు. సూపర్‌వైజర్లు భాజవతి, ద్రాక్షాయని, ఆరోగ్య సిబ్బంది ఉష, నీరజ, అంగన్‌వాడీ కార్యకర్త కళావతి, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

కట్టపుట్టాలమ్మా పాహిమాం..


విశేష అలంకరణలో అమ్మవారు, నాగహారతికి పూజలు

రేణిగుంట: మండలంలోని కరకంబాడిలో వెలసిన కట్టపుట్టాలమ్మ జాతర మంగళవారం కోలాహలంగా జరిగింది. రెండు రోజులపాటు జరగనున్న జాతరలో భాగంగా తెల్లవారుజామున తొలుత అమ్మవారిని వంశపారంపర్య ధర్మకర్తలు రామచంద్రయ్య, వాసు ఆధ్వర్యంలో ఆలయ పూజారి విశేష అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించారు. భక్తులు ఆలయానికి చేరుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు క్యూలో నిల్చుని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు చలం, రాజేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, బుజ్జినాయుడు, కృష్ణమూర్తి పాల్గొన్నారు. కాగా గురువారం నాగహారతి ఊరేగింపుతో ఉత్సవాలు ముగియనున్నాయి.

ముర్రుపాలు బిడ్డకు శ్రేష్టం


పంగూరులో మాట్లాడుతున్న రత్నమ్మ

ఏర్పేడు: జన్మించిన బిడ్డకు ముర్రుపాలు ఎంతో శ్రేష్టమని సూపర్‌వైజర్ రత్నమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని పంగూరు, జంగాలపల్లి, కృష్ణంపల్లి, కొత్తవీరాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార వారోత్సవాలు జరిగాయి. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముర్రుపాలు రోగనిరోధకశక్తిని పెంపొందిస్తాయని చెప్పారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రసూతిలోనే కాన్పులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, సంపూర్ణ, భూలక్ష్మి, రాజేశ్వరి, బుజ్జమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బిజీబిజీగా అన్నదాతలు


అంజిమేడులో వరిపంటకు ఒబ్బిడి చేస్తున్న వరికోత యంత్రం

ఏర్పేడు: వరికోత ఒబ్బిడి పనుల్లో నిమగ్నమై రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌లో విద్యుత్ మోటార్ల ద్వారా రైతన్నలు 5,600 ఎకరాలకుపైగా ఆర్ఎన్ఆర్, బుడ్డలు, 1010 రకాల వరి వేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన వరిని ఒబ్బిడి చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు వర్షాలు పడుతుండడంతో వరిపంట నేలకొరిగింది. వరికోత యంత్రాల ద్వారా ఒబ్బిడి చేయడానికి అధిక సమయం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా రైతులు వరిపంటను వరికోత యంత్రాల ద్వారా ఒబ్బిడి చేసుకుంటున్నారు.

చేతివృత్తులతో స్వయం ఉపాధి


టైలరింగ్ మిషన్లు అందుకున్న మహిళలతో సర్పంచ్, రాస్ ప్రతినిధులు


కుట్టు ఉపకరణాలను అందిస్తున్న సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి

నారాయణవనం: చేతి వృత్తులపై నైపుణ్యం సాధించడం ద్వారా స్వయం ఉపాధిని మహిళలు పొందవచ్చునని పలువురు పేర్కొన్నారు. రాస్‌జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో సముదాయంలో మహిళలకు శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లను అందజేశారు. గ్రామంలోని మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీపై శిక్షణ తరగతులను నిర్వహించారు. నైపుణ్యత పొందిన 9 మందికి కుట్టుమిషన్లను సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, రాస్‌జన్ శిక్షణ్ సంస్థాన్ ప్రతినిధులు అందజేశారు. సమావేశంలో సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల మహిళలకు చేతి వృత్తులపై శిక్షణ ఇస్తూ, నైపుణ్యతను పెంచడంతో ఆర్థిక స్వావలంబనకు సాధ్యమవుతుందని అన్నారు. విరామ సమయంలో చేతివృత్తులపై ఆసక్తి పెంచుకుని, శిక్షణతో నైపుణ్యతను పెంచుకోవాలని అన్నారు. బ్యాంకుల ద్వారా చేతివృత్తుల వారికి రుణాలను అందివ్వడానికి కృషిచేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ సందర్భంగా మహిళలు సచివాలయ పరిశరాలలో స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేశారు. రాస్ ప్రతినిధులు హరిమ రవి, మునిరత్నమ్మ, మాలిని పాల్గొన్నారు.